సాక్షి
తూర్పుగోదావరి

శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



ప్రకృతి ఇచ్చిన అమ్మృతం

అమ్మ పాలు అమృతంతో సమానం. తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం. పుట్టిన మరుక్షణం నుంచి కనీసం ఆరు నెలలైనా బిడ్డకు తల్లిపాలు పట్టాలి.


8లో



టోల్ దోపిడీకి ప్రణాళిక

రాష్ట్ర, జిల్లా, గ్రామీణ రహదారులపై టోల్ దోపిడీకి కూటమి ప్రభుత్వం తెర తీసిందని అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ అన్నారు.

డెల్టాలకు 8,800 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఖరీఫ్ సాగుకు అవసరాలకు 8,800 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 1,000, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

రూ.40 లక్షల వార్షిక వేతనంతో గోదారి బిడ్డకు కొలువు



నిర్మలప్రియ

రాజాం సిటీ: విజయనగరం జిల్లా రాజాం పట్టణంలోని జీఎంఆర్ ఐటీలో చదువుతున్న వి.నిర్మలప్రియ ఏడీపీ అంతర్జాతీయ సంస్థలో రూ.40 లక్షల వార్షిక వేతనంతో కొలువు సాధించింది. తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన ఆమె తండ్రి వెలిసి వెంకటరావు సాధారణ కేటరింగ్ వ్యాపారం చేస్తూ కుమార్తెను చదివించారు. తండ్రి కష్టాన్ని వమ్ము చేయకుండా నిర్మలప్రియ చదువులో రాణించి, అధిక వార్షిక వేతనంతో కొలువు సాధించిందని జీఎంఆర్ ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. ఆమెతో పాటు మరో ఐదుగురు విద్యార్థులకు 8వ సెమిస్టర్‌లో భాగంగా పారిస్‌లోని ఏడీపీ గ్రూపులో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం వచ్చింది. ఒక్కో విద్యార్థి నెలకు రూ.1,000 యూరోల స్టైపెండ్‌తో ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారు. ఇందులో ప్రతిభ చూపిన నిర్మల ప్రియ ఏడీపీలో కొలువు సాధించింది. ఆమెను ప్రిన్సిపాల్ తదితరులు గురువారం అభినందించారు. కెరీర్‌పాత్ కోర్సులలో ఒకటైన సైబర్ సెక్యూరిటీ కోర్సు పూర్తి చేయడంతో తనకు ఈ కొలువు దక్కిందని నిర్మలప్రియ తెలిపింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల బోధనతో మంచి వేతనంతో కూడిన ఉద్యోగం లభించడం ఆనందంగా ఉందని చెప్పింది.

ఈపీడీసీఎల్ ఎస్ఈగా తిలక్ కుమార్ బాధ్యతల స్వీకారం



రాజమహేంద్రవరం సిటీ: ఏపీ ఈపీడీసీఎల్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎస్ఈగా కె.తిలక్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు, సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటానని చెప్పారు. రాజమహేంద్రవరంలోని ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయనకు పలువురు విద్యుత్ ఉద్యోగులు అభినందనలు తెలిపారు. తిలక్ కుమార్ గతంలో రెండుసార్లు రాజమహేంద్రవరంలో ఆరేళ్లు వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. విశాఖలోని ఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో చీఫ్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను రాజమహేంద్రవరం ఎస్ఈగా వచ్చారు. ఇక్కడ ఇప్పటి వరకూ ఎస్ఈగా విధులు నిర్వహించిన టీవీఎస్ఎన్ మూర్తి విశాఖలోని ఈపీడీసీఎల్ కార్యాలయంలో ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్‌గా పదోన్నతిపై నియమితులయ్యారు. కార్యక్రమంలో ఈఈ నక్కపల్లి శామ్యూల్ పాల్గొన్నారు.

వెబ్ ఆప్షన్లకు 5 వరకూ అవకాశం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల ఐదో తేదీ వరకూ వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే గురువారం తెలిపారు. వెబ్ ఆప్షన్లలో మార్పులకు 6న అవకాశం ఉందన్నారు. ఏ కళాశాలలో ఏ విభాగంలో సీటు కేటాయించారో విద్యార్థులకు ఈ నెల 10వ తేదీన తెలియజేస్తారన్నారు. వారందరూ 12 నుంచి 16వ తేదీలోపు తమకు కేటాయించిన కళాశాలలో రిపోర్ట్ చేయాలన్నారు. వెబ్ ఆప్షన్ల నమోదులో ఎటువంటి సందేహాలున్నా ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాలులో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

తగ్గుతున్న గోదావడి



ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి వరద ఉధృతి క్రమేపీ తగ్గుతోంది. బ్యారేజీ వద్ద గురువారం ఉదయం 6 గంటలకు 12.30 అడుగులుగా ఉన్న నీటి మట్టం రాత్రి 7 గంటలకు 12.10 అడుగులకు తగ్గింది. బ్యారేజీ నుంచి 10,33,672 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. ఎగువన భద్రాచలం వద్ద కూడా ప్రవాహం తగ్గుముఖం పట్టింది. అక్కడ నీటిమట్టం 40.30 అడుగులకు తగ్గడంతో ప్రమాద హెచ్చరికలు పూర్తిగా ఉపసంహరించారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక అమలులో ఉంది. శుక్రవారం నాటికి నీటి ప్రవాహం సాధారణ స్థాయికి చేరే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు.

వివిధ ప్రాంతాల్లో గోదావరి నీటిమట్టాలు (మీటర్లలో)

కాళేశ్వరం	8.47
పేరూరు	13.57
దుమ్ముగూడెం	10.90
కూనవరం	18.35
కుంట	9.75
పోలవరం	12.26
రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి	16.16

ఇళ్ల స్థలాలపై మార్గదర్శకాలు రాలేదు

రాజానగరం: పేదల నివాసాల కోసం సేకరించిన భూముల్లో పట్టాలు ఇచ్చే విషయమై ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాల్సి ఉందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గురువారం దివాన్ చెరువు వచ్చిన ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో 3,800 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అవసరమైన స్థలం సేకరించారన్నారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినందున వీటిపై ప్రస్తుత పాలకులు మార్గదర్శకాలు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. రాజానగరం – కాకినాడ ఏడీబీ రోడ్డు మరమ్మతు పనులు ప్రస్తుతం జరుగుతున్నాయన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పని తీరు మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల నుంచి ఆరోపణలు రావడంతో ఇటీవల నల్లజర్ల పీహెచ్‌సీని తనిఖీ చేశామన్నారు. రాజానగరం పీహెచ్‌సీలో రోగులకు 24 గంటలూ సేవలందించాల్సి ఉందని, పూర్తి స్థాయిలో ఒక వైద్యుడు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారని కలెక్టర్ స్పష్టం చేశారు.



దివాన్ చెరువులో సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పెన్షన్ల పంపిణీ


సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లావ్యాప్తంగా 2,40,595 మందికి రూ.102.55 కోట్ల మేర ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక రాజేంద్ర నగర్ 3, 4 వార్డుల్లో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర అధికారులతో కలిసి లబ్ధిదారులకు ఆమె పింఛన్లు పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించేందుకు 3,900 మంది సచివాలయ, 300 మంది ఇతర సిబ్బందిని నియమించామన్నారు.

వర్గీకరణపై మోదీ, చంద్రబాబు నాటకాలు

గోపాలపురం: ఎస్సీ వర్గీకరణపై ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాటకాలు ఆడుతున్నారని, విభజించి పాలించు సిద్ధాంతాన్ని అమలు చేస్తున్నారని పీవీ రావు మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దొడ్డి వెంకటేశ్వర్లు ఆరోపించారు. గోపాలపురంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఎస్సీ వర్గీరణపై రాజ్యాంగానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పు చెప్పడం ఎస్సీ, దళితులకు చీకటి రోజని అన్నారు. ఈ తీర్పు ప్రధాని మోదీ, చంద్రబాబు కుట్ర అని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, మాదిగలు కలిసి ఉంటేనే రాజ్యాధికారం సాధించుకోగలమని చెప్పారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు వ్యవస్థలను అడ్డం పెట్టుకుని నియంతల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. త్వరలో జిల్లా, రాష్ట్ర నాయకులతో చర్చలు జరిపి, తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పీవీ రావు మాలమహానాడు మండల అధ్యక్షుడు కొయ్య వెంకటరమణ, వేళ్లచింతల గూడెం సర్పంచ్ గోళ్ల కుమార్ పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న నాయకులు



మిత్రభేదం!

- రాజానగరంలో జనసేన వర్సెస్ టీడీపీ
- టీడీపీ నేతల మైనింగ్ కార్యకలాపాలకు జనసేన మోకాలడ్డు
- టీడీపీ కీలక నేతపై అధికారులకు ఎమ్మెల్యే బత్తుల ఫిర్యాదు
- పట్టించుకోకపోవడంతో నేరుగా రంగంలోకి..
- కంకర ట్రాక్టర్లను నిలువరించి పోలీసులకు అప్పగింత
- టీడీపీ రివర్స్ అటాక్

సాక్షి, రాజమహేంద్రవరం: రాజానగరం **జనసేన** ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ **స్వపక్షంలో విపక్ష** పాత్ర పోషిస్తున్నారా.. మిత్రపక్ష**మైన టీడీపీ నేతల** మైనింగ్ అక్రమాలపై విరుచు**కుపడుతున్నారా..** ఇటీవల ఓ టీడీపీ ప్రధాన నేత **కంకర లారీలను** స్వయంగా నిలువరించి పోలీ**సులకు అప్పగించ**డమే దీనికి సాక్ష్యంగా నిలుస్తోం**దా.. బత్తుల వ్యవ**హార శైలితో టీడీపీ నేతలు రివ**ర్స్ అటాక్ ప్రారం**భించారా.. అంటే అవుననే సమాధానం వస్తోంది రాజకీయ విశ్లేషకుల నుంచి.

ఇదీ సంగతి

రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వ్యవహార శైలి టీడీపీ శ్రేణులకు మింగుడు పడటం లేదు. తమను పూర్తిగా విస్మరిస్తూండటం, కనీస గౌరవం ఇవ్వకపోవడంపై టీడీపీ నేతలను గుర్రుగా ఉన్నారు. జనసేన, టీడీపీ మిత్రపక్షాలే అయినప్పటికీ ఎమ్మెల్యే బత్తుల, టీడీపీ నేతలు కలిసి ఎలాంటి కార్యక్రమాల్లోనూ కలిసి వెళ్లడం లేదు. ప్రభుత్వ కార్యక్రమాలను సైతం వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. దీనిని బట్టి చూస్తే ఇరు పార్టీల మధ్య విభేదాలు ఏ స్థాయిలో ఉన్నాయో అవగతమవుతోంది. టీడీపీపై ఎలాగైనా పైచేయి సాధించాలనే తలంపుతో ఉన్న ఎమ్మెల్యే బత్తుల.. ఆ పార్టీ నేతల మైనింగ్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించుకున్నారు. టీడీపీ నేతల మైనింగ్ కార్యకలాపాలపై అధికారులతో దాడులు చేయించి, తన కాళ్ల వద్దకు రప్పించుకునే వ్యూహం రచించారు. అయితే, అది కాస్తా బెడిసికొడుతోందని తెలుస్తోంది.

రాజానగరం నియోజకవర్గంలో ఇసుక, కంకర, మట్టి దందా టీడీపీ నేతల కనుసన్నల్లో యథేచ్ఛగా సాగుతోంది. దీనిపై జనసేన ఎమ్మెల్యే బత్తుల దృష్టి సారించారు. టీడీపీ నేతల మైనింగ్ వ్యవహారాలపై దాడులు చేయాలని అధికారులకు అల్టిమేటం జారీ చేశారు. దీనికోసం తీవ్ర ఒత్తిడి పెంచారు. అయితే, అవి టీడీపీ నేతలవి కావడంతో చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనకడుగు వేశారు. ఇక లాభం లేదని భావించిన ఎమ్మెల్యే తనే నేరుగా రంగంలోకి దిగారు. జనసేన కార్యకర్తలను వెంటబెట్టుకుని కోరుకొండ వద్ద కాపు కాసి కంకర లోడుతో వెళుతున్న ఆరు లారీలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆ లారీలు సీఎం చంద్రబాబు జైలులో ఉన్న సమయంలో ఆయన కుటుంబానికి ఆశ్రయమిచ్చిన బడా నేతవి కావడంతో ఈ విషయాన్ని టీడీపీ నేతలు తీవ్రంగా పరిగణించారు. ఇక చూస్తూ ఊరుకోరాదని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో బత్తుల తీరుపై టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారని విశ్వసనీయ వర్గాల సమాచారం. దీనిపై ఎమ్మెల్యే బత్తులకు జనసేన అధిష్టానం గట్టిగా తలంటిందని చెబుతున్నారు.



కోరుకొండలో బత్తుల అడ్డుకున్న టీడీపీ నేతకు చెందిన లారీలు

టీడీపీ ఎదురు దాడి

ఎమ్మెల్యే బత్తుల వ్యవహార శైలితో రగిలిపోతున్న టీడీపీ శ్రేణులు రివర్స్ అటాక్ ప్రారంభించాయి. తనకు వాటా ఇవ్వలేదన్న అక్కసుతోనే తమపై ఆయన దాడులకు దిగుతున్నారంటూ ఎదురు **దాడి చేస్తున్నారని సమాచారం. ఎన్నికల్లో పెట్టిన ఖర్చు రాబట్టుకునేందుకే ఇలా తమ మైనింగ్, ఇతర కార్యకలాపాలకు అడ్డం పడుతున్నారని బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. మొత్తంమీద ఈ** వ్యవహారం రెండు పార్టీల మధ్య మిత్రభేదానికి దారి తీస్తుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

అవగాహన లేక ఇబ్బందులు

తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన బత్తుల బలరామకృష్ణ వ్యవహరిస్తున్న తీరు అటు ప్రజలను, ఇటు పార్టీ నేతలను విస్మయానికి గురి చేస్తోంది. ప్రజా సమస్యల పరిష్కారం పేరుతో ప్రతి సోమవారం ఆయన గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. ఇందులో భూ సంబంధిత, వ్యక్తిగత సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. వీటిని ఏవిధంగా పరిష్కరించాలో అర్థం కాక సతమతమవుతున్నారని చెబుతున్నారు. అలాగని అధికారులను ఆదేశిస్తే వెంటనే పరిష్కారమయ్యే సమస్యలు కాకపోవడంతో ఏం చేయాలో తెలియక దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారని పలువురు అంటున్నారు.

రాజానగరం సమీపంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వద్ద కూడా ఎమ్మెల్యే బత్తుల ఇటీవల నానా హంగామా చేశారు. విశ్వవిద్యాలయంలో సిబ్బంది నియామకంపై విమర్శలు గుప్పించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అక్రమాలు జరిగాయంటూ ఆరోపించారు. సిబ్బంది నియామకాలు టీడీపీ హయాంలోనే జరిగాయంటూ వైఎస్సార్ సీపీ కౌంటర్ ఇవ్వడంతో ఏం చేయాలో తెలియక వెనుదిరిగారు. దీనిపై టీడీపీ నేతలు విమర్శనాస్త్రాలు గుప్పిస్తున్నారు. పదో తరగతి మాత్రమే చదువుకున్న ఎమ్మెల్యే అవగాహన రాహిత్యంతో ఉన్నారంటూ దుయ్యబడుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా సదరం శిబిరాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా వ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సదరం శిబిరాలు నిర్వహించి, దివ్యాంగులకు ధ్రువపత్రాలు జారీ చేయనున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరం సర్టిఫికెట్ కావలసిన వారు స్లాట్ కోసం ఆయా గ్రామ/వార్డు సచివాలయాల్లో పేర్లు, వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. స్లాట్ కేటాయించిన అనంతరం వారి ఫోన్‌కు ఆ వివరాలు పంపుతారన్నారు. అందులో పేర్కొన్న తేదీల్లో వైద్య పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. ప్రతి సోమవారం కొవ్వూరు, గోపాలపురం; ప్రతి మంగళవారం కడియం, గోకవరం; ప్రతి బుధవారం నిడదవోలు, రాజానగరం; ప్రతి గురువారం అనపర్తి సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో (సీహెచ్‌సీ) ఆర్థోపెడిక్ పరీక్షలు నిర్వహించనున్నామని వివరించారు. రాజమహేంద్రవరం నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో (జీజీహెచ్) ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఐదు విభాగాలకు సంబంధించిన సదరం క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే, ప్రతి సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ రోజున ఆరోగ్య సంబంధ పింఛన్ల అభ్యర్థనలు స్వీకరిస్తామని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు.

ఇసుక అవకతవకలు జరిగితే అధికారులదే బాధ్యత

- మొదట వచ్చిన వారికి మొదట ఇవ్వాలి
- పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి మీనా

పెరవలి: ఇసుక ర్యాంపుల వద్ద అవకతవకలు జరిగితే అధికారులదే బాధ్యత అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. ర్యాంపుల వద్ద విధుల్లో ఉండే ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధత, జవాబుదారీతనంతో పని చేయాలని ఆదేశించారు. మండలంలోని కానూరు – పెండ్యాల ఇసుక ర్యాంపును గురువారం కలెక్టర్ పి.ప్రశాంతితో కలసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ర్యాంపుల వద్ద అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. వినియోగదారు అభ్యర్థనే ప్రామాణికంగా ఇసుక పంపిణీ చేయాలని, లోకల్, నాన్ లోకల్ అనే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలోని ఇసుక రీచ్‌లలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఇసుక అమ్మకాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రీచ్‌లలో ఇసుక లభ్యత ఆధారంగా క్యూలో ఉండే వాహనాన్ని బట్టి టోకెన్లు జారీ చేస్తామని, సాయంత్రం 6 గంటల తరువాత ఎటువంటి లోడింగ్ జరగకుండా క్షేత్ర స్థాయి సిబ్బందికి, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. పెండ్యాల ఇసుక ర్యాంపులో ఇసుక కోసం వచ్చిన వాహనాలను కలెక్టర్ స్వయంగా క్రమబద్ధీకరించి, అధికారుల సూచనలు పాటించాలని రవాణాదారులకు తెలిపారు. జిల్లాలో 47 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలున్నాయని, ఇది మూడు నెలలకు సరిపోతుందనుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా రెవెన్యూ అధికారి, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.నరసింహులు, మైన్స్ ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



కానూరు - పెండ్యాల ర్యాంపు వద్ద కలెక్టర్‌తో మాట్లాడుతున్న పీఆర్ ముఖ్యకార్యదర్శి మీనా

పారి-చోద్యం.. పడకేసిన వైద్యం

- జిల్లావ్యాప్తంగా వైరల్ జ్వరాల విజృంభణ
- ఆస్పత్రుల్లో వేధిస్తున్న ఔషధాల కొరత
- సర్వేకే పరిమితమవుతున్న ఆరోగ్య సిబ్బంది
- ప్రత్యేక వైద్య శిబిరాల ఊసెత్తని ప్రభుత్వం

అలమూరు: ప్రపంచ వ్యాప్తంగా ప్రళయాన్ని సృష్టించి ప్రాణ, ఆర్థికపరమైన నష్టాన్ని కలిగించి ప్రజా జీవితంతో చెలగాట మాడుకున్న కోవిడ్–19 మళ్లీ వేరే రూపాల్లో విజృంభిస్తుందంటూ ఆందోళన వ్యక్తమవుతున్న దృష్ట్యా గత వారం రోజుల నుంచి జిల్లాలో పెరిగిపోతున్న వైరల్ జ్వరాలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి వైద్యారోగ్యశాఖపై పర్యవేక్షణ కొరవడటంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ఉదాసీన వైఖరిని అవలంబిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సక్రమంగా వైద్యసేవలు అందక రోజురోజుకు జ్వరాల తీవ్రత పెరిగిపోతోంది. దీంతో జిల్లాలోనున్న 63 ప్రభుత్వ ఆస్పత్రులు జ్వర పీడితులతో కిక్కిరిసిపోతున్నాయి. ఆస్పత్రుల్లో ఉన్న పడకలన్నీ రోగులతో నిండిపోతున్నాయి. పీహెచ్‌సీల్లో అయితే రోజుకు సరాసరి సుమారు 150 మంది, సీహెచ్‌సీలో అయితే 350 మంది వరకూ ఓపీ నమోదవుతోంది. జ్వర పీడితులు సంఖ్య గణనీయంగా పెరిగిపోతుండటంతో ఆస్పత్రుల్లో పడకలు కూడా ఖాళీగా లేక రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.



నర్శిపూడిలో ఇంటింటికి వెళ్లి జ్వరాల సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



జొన్నాడ-కాకినాడ రోడ్డులో పడవేసిన వ్యర్థాలు

సర్వేలకే పరిమితమవుతున్న ఆరోగ్య సిబ్బంది

సీజనల్ వ్యాధులు విజృంభిస్తూ జ్వరాల తీవ్రత పెరుగుతున్నా గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య సిబ్బంది కేవలం సర్వేలకే పరిమితమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని 415 గ్రామ సచివాలయాల పరిధిలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ఉన్నా క్షేత్రస్థాయిలో సేకరించిన సర్వేను సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సమాచారం అందించడంతోనే కాలం గడిచిపోతోంది. దీంతో గ్రామీణ స్థాయిలో ఆరోగ్యపరమైన సూచనలు, సలహాలను ఇవ్వడానికి మాత్రమే తప్ప వ్యాధుల నివారణకు కృషి చేసే పరిస్థితి ఉండే అవకాశం లేదు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రులు, 104 వాహనాల్లో వేధిస్తున్న మందుల కొరత వల్ల గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రెండుసార్లు అందించే ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో కూడా సక్రమంగా వైద్యసేవలను అందించడం లేదని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తుండటం పరిస్థితికి అద్దం పడుతోంది. సీజనల్ వ్యాధులు రోజురోజుకు పెరుగుతున్నా ఇప్పటి వరకూ ప్రత్యేక వైద్య శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడం వల్లే ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో జ్వర పీడితుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

కొన్నిచోట్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరియైన వైద్య సేవలు అందక, పడకలు లభించక అనేక మంది రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. గత ప్రభుత్వం మాదిరిగా సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామస్థాయిలో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణపై స్పందించకపోవడం పల్లె ప్రజల ఆరోగ్యాన్ని మరింత క్షీణింపజేస్తోంది.

సీజనల్ వ్యాధుల విజృంభణ

గ్రామీణ, పట్టణ ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం పడకేసింది. సకాలంలో వైద్య సేవలు అందక పల్లె ప్రజానీకం ఇబ్బందులు పడుతోంది. గ్రామాల్లో నిధుల లేమితో పారిశుద్ధ్యం నాటినాటికీ దిగజారిపోతుండటంతో అంతటా దుర్గంధం వెలువడి అంటు రోగాలకు కారణమవుతోంది. దీంతో సీజనల్ వ్యాధులైన టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి జ్వరాలు తీవ్రంగా విజృంభిస్తున్నాయి. అతిసార వ్యాధి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సంభవించే అవకాశం ఉండటంతో గత ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా ఔషధాలను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యసేవలను అందించేందుకు కృషి చేసేది. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్యారోగ్యశాఖపై ప్రభుత్వానికి సరియైన అవగాహన లేకపోవడంతో సక్రమమైన వైద్యసేవలు అందడం లేదు. ప్రస్తుతం పీహెచ్‌సీల్లో 173 రకాల ఔషధాలు ఉండవలసి ఉండగా కేవలం 87 రకాలు, సీహెచ్‌సీల్లో 224 వరకూ రకాలు ఉండాల్సి ఉండగా కేవలం 145 రకాల ఔషధాలు మాత్రమే ఇంచుమించు అందుబాటులో ఉంటున్నట్లు ఆస్పత్రుల గణాంకాలను బట్టి తెలుస్తోంది. దీనివల్ల రోగులు ప్రైవేట్ మందుల షాపులకు వెళ్లి మందులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.




ఆలమూరు సీహెచ్‌సీలో వైద్య సేవల కోసం పడిగాపులు పడుతున్న రోగులు

నిధుల లేమితో గ్రామ పంచాయతీలు

ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని తెలిసినా ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య సమస్య తీవ్రంగా వేధిస్తుంది. గ్రామాల్లోని ప్రధాన రహదారుల్లో ఎక్కడ చూసినా చెత్త చెదారం దర్శనమిస్తుంది. గ్రామాల్లోని డ్రైనేజీల్లో ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోవడంతో దోమల ఉధృతి పెరిగిపోతుంది. దీంతోపాటు పలుచోట్ల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులను సకాలంలో శుభ్రం చేయకపోవడం కూడా అంటువ్యాధులకు కారణమవుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇంట్లోని వ్యర్థాలను కొన్నిచోట్ల పంట కాలువల్లో పడవేయడంతో పశువుల ద్వారా సంభవించే జునోసిస్ సంబంధిత వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. నిధుల లేమితో గ్రామ పంచాయతీలు బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి మాత్రమే పరిమితమవుతున్నాయి. గ్రామ పంచాయతీ ఖజానాల్లో సొమ్ము లేకపోవడంతో దోమల నివారణకు క్రిమి సంహారక రసాయన మందులు చల్లించలేకపోవడం కూడా అంటువ్యాధుల వ్యాప్తికి కారణంగా స్థానికులు చెబుతున్నారు,

జ్వరాల నియంత్రణకు చర్యలు



సీజనల్ దృష్ట్యా సంభవించే జ్వరాలు, వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోనున్న అన్ని కుటుంబాలను సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించి ఆమేరకు చికిత్సను అందించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటి వరకూ వరద ప్రభావిత ప్రాంతాల్లో మాదిరిగానే జ్వరాల తీవ్రత ఉన్న గ్రామాల్లోనూ ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తాం.

– కె.దుర్గారావు దొర, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, అమలాపురం

క్లుప్తంగా

బ్యాంకు ఖాతా నుంచి రూ.2.20 లక్షల మాయం

అంబాజీపేట: గుర్తుతెలియని సైబర్ నేరగాళ్ల నుంచి ఒక మహిళ సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజీను ఓపెన్ చేయడంతో రూ.2.20 లక్షలను దోచుకున్న ఘటన ఇది. స్థానిక ఎస్‌ఐ కె.చిరంజీవి కథనం ప్రకారం మండలంలోని మొసలపల్లికి చెందిన వేదుల కిరణ్‌కుమారి సెల్‌ఫోన్‌కు గత నెల 16న మెసేజ్‌లు వచ్చాయి. ఆ మెసేజ్‌లను ఆమె ఓపెన్ చేయడంతో 18వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఆమె ఖాతాలో ఉన్న నగదు మొత్తం దశల వారీగా కట్ అవుతున్నట్లుగా మెసేజ్‌లు వచ్చాయని ఎస్‌ఐ వివరించారు. వెంటనే ఆమె పులేటికుర్రు యూనియన్ బ్యాంకుకు వెళ్లి విచారణ చేయగా కిరణ్ కుమారి ఖాతా నుంచి రూ.2,20,500 మూడు దఫాలుగా రూ.1,50,000, 50,000, 20,500 చొప్పున బదిలీ అయినట్లు బ్యాంక్ అధికారులు తెలిపారని ఆమె ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొందని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆర్టీసీ బస్ ఢీకొని వృద్ధుడి మృతి



మృతిచెందిన బలరాముడు

పెరవలి: టిఫిన్ కోసం ఇంటి నుంచి బయటకు వచ్చిన వృద్ధుడు ఆర్టీసీ బస్ ఢీకొట్టటంతో మృతి చెందాడు. పెరవలి ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నడుపల్లి కోటలో చిర్రా బలరాముడు (70) గురువారం ఉదయం టిఫిన్ కొనడానికి ఇంటి నుంచి సైకిల్‌పై వెళుతుండగా రాజమహేంద్రవరం నుంచి తణుకు వెళుతున్న ఆర్టీసీ బస్ ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్రగాయాలు పాలయ్యాడు. ప్రమాదం జరిగిన వెంటనే తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్న బలరాముడుని హుటాహుటిన తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యం అందిస్తుండగా మృతి చెందాడు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మూర్తి తెలిపారు.

చోరీ కేసులో రెండేళ్ల జైలు

మండపేట: ఓ దొంగతనం కేసులో రెండేళ్ల జైలు శిక్ష పడినట్టు ఎస్‌ఐ హరికోటి శాస్త్రి గురువారం తెలిపారు. ఏడో వార్డులో నివాసముంటున్న నెల్లూరు లక్ష్మి ఇంటిలో ఈ ఏడాది మే 29వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో మండలంలోని ఏడిదకు చెందిన చంద్రమళ్ల శేఖర్ దొంగతనానికి పాల్పడ్డాడు. లక్ష్మి తన ఇంటి తలుపులు వేసి నిద్రిస్తున్న సమయంలో లోపలికి చొరబడి 92 గ్రాములు బంగారు వస్తువులు, రూ.4 వేల నగదును అపహరించుకుపోయాడు. అదే నెల 31న నిందితుడిని అరెస్టు చేసి, ఆలమూరు కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఐ.ప్రవీణ్‌కుమార్ శిక్ష విధించినట్టు తెలిపారు.

ప్రకృతి ఇచ్చిన అమ్మృతం



- బిడ్డకు తల్లి పాలు శ్రేయస్కరం
- శిశు మరణాలను నియంత్రించేది అమ్మపాలే
- పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టాలి
- 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు

బాధ్యతగా భావించాలి



ముర్రుపాలు పట్టించడం భారం అనుకోవద్దు. బిడ్డకు 2 సంవత్సరాల పాటు తల్లి పాలు కొనసాగించాలి. ముర్రుపాలు బిడ్డకు అమృతం లాంటిది. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు స్థానిక వైద్య సిబ్బంది తల్లిపాల విశిష్టత తెలియజేస్తూ ర్యాలీ, అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.

– కె ప్రవీణ, జిల్లా స్త్రీ, శిశుసంక్షేమాధికారిణి, కాకినాడ

రాయవరం/కాకినాడ సిటీ: అమ్మ పాలు అమృతంతో సమానం. తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం. పుట్టిన మరుక్షణం నుంచి కనీసం ఆరు నెలలైనా బిడ్డకు తల్లిపాలు పట్టాలి. పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు కీలకం. అమ్మపాలు తాగిన బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారు. తల్లిపాలకు దూరమైన బిడ్డలు అనారోగ్యం పాలవుతుంటారు. తల్లి పాలను మించిన ఔషధం లేదు. బిడ్డకు తొలి ఆహారం అమ్మపాలే. తల్లిపాలకు సాటి మరేది లేదు. తల్లుల్లో ఉన్న అపోహలతో కొందరు మాతృమూర్తులు వారి బిడ్డలకు శ్రేష్ఠమైన తల్లిపాలను దూరం చేస్తున్నారనే విమర్శలున్నాయి. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్ తదితర అంతర్జాతీయ సంస్థలతో పాటు, జాతీయ సంస్థలు తల్లిపాల ప్రాధాన్యం తెలియజేప్పేందుకు ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నాయి. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వైద్యశాఖలు సంయుక్తంగా పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది తల్లిపాల వారోత్సవాల ప్రాధాన్యాన్ని తెలియజేసేందుకు 'క్లోజింగ్ ద గేప్: బ్రెస్ట్ ఫీడింగ్ సపోర్ట్ ఫర్ ఆల్' అనే నినాదంతో తల్లి పాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు.



తల్లిపాల వారోత్సవాల పోస్టర్

వెలుగు రేఖలు సంతానం

ఇంటికి దీపం ఇల్లాలైతే ఆ దీపం ప్రసరించే వెలుగురేఖలు సంతానం. తల్లీపిల్లలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటేనే ఆ ఇల్లు కాంతులీనుతుంది. అమ్మ కడుపు నుంచి బయటకు వచ్చిన బిడ్డ తొలిసారి లోకం చూసే సరికి వింత, కొత్త వాతావరణాన్ని ఎదుర్కొంటుంది. ఎండలు..వానలు..చలి బిడ్డను ఇబ్బంది పెడతాయి. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో అమ్మ ఒడి బిడ్డకు తొలి రక్షణ గోడలా నిలుస్తుంది.

రోగనిరోధక శక్తిని పెంచుతుంది

ముర్రుపాలలో పసుపుపచ్చని కొలస్ట్రం(కొలెస్ట్రాల్) అనే పదార్థం ఉంటుంది. గుండె రక్తప్రసరణ వ్యవస్థ, నాడీ వ్యవస్థ పనితీరును అభివృద్ధి పరుస్తుంది. శిశువులో రోగనిరోధక శక్తి పెంచి ఎదుగుదలకు దోహదం చేస్తుంది. ఖనిజాలు, మాంసకృతులు, విటమిన్లు, తల్లిపాలలో సమృద్ధిగా ఉంటాయి. బిడ్డ పేగుల నుంచి విసర్జకాలను తొలగించడానికి, అలర్జీలు నిరోధించేందుకు తల్లిపాలు తోడ్పడతాయి. ముర్రుపాలు బిడ్డకు ఇవ్వడం వల్ల సులువుగా జీర్ణమవ్వడంతో పాటు మలవిసర్జన కూడా సులభంగా జరుగుతుంది. శిశువుకు దృష్టి లోపం రాకుండా నివారిస్తుంది. శిశువుకు కావాల్సిన ఉష్ణోగ్రతలు తల్లిపాలలో ఉంటాయి.

బిడ్డకు తొలి టీకా ముర్రుపాలు

తల్లిపాల వలన పోషకాహార లోపాలు తగ్గి 13శాతం శిశు మరణాలు తగ్గించవచ్చని వైద్య పరిశోధనల్లో తేలింది. తల్లిపాలు తాగే శిశువుల్లో మేధాశక్తి కూడా పెరుగుతుందని పరిశోధనల్లో రుజువైంది. బిడ్డ కోరుకున్న ప్రతీసారి ఎంతసేపు తాగితే అంతసేపు పట్టించాలి. శిశువుకు తల్లి పాలివ్వడం వలన ఆరు నెలల్లోపు గర్భం దాల్చే అవకాశం ఉండదు. సహజ కుటుంబ నియంత్రణ పద్ధతిగా ఉపయోగపడుతుంది. బిడ్డకు తల్లి స్తన్యం మివ్వడం వలన రొమ్ము, గర్భసంచి, అండాశయం క్యాన్సర్‌లు వచ్చే అవకాశం తక్కువని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.

తల్లి పాలలో ఉండే సుగుణాలు

పాలలో ఎక్కువ భాగం (87–88 శాతం) నీరు ఉంటుంది. బిడ్డకు సరిపడినన్ని (0.9–1 శాతం) ప్రోటీన్లు ఉంటాయి. శరీరానికి అవసరమైన కొవ్వు పదార్థాలు సమృద్ధిగా ఉంటాయి. పాలు తాగే పసిపాప కూడా అరిగించుకోగల కొవ్వును అందించడం కోసమే ప్రకృతి అమ్మ పాలను తయారు చేసింది. ఇందులో డీహెచ్‌ఏ అనే కొవ్వు పదార్థం ఉంటుంది. మొదటి మూడు నెలలూ ఈ కొవ్వు పదార్థాలు ఎక్కువగా అందాలి. అందుకే పోషకాలు బిడ్డకు అందేలా తల్లి తగినంత కొవ్వు పదార్థాలను రిజర్వ్‌లో ఉంచుకోవాలి. అప్పుడే బిడ్డ మెదడులో మంచి ఎదుగుదల కనిపిస్తుంది.

ఏటా ఆగస్టు తొలివారంలో..

తల్లిపాలు పట్టడం వలన బిడ్డలు ఆరోగ్యంగా ఉండడమే కాకుండా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్న ఉద్దేశంతో వరల్డ్ అలైన్స్ ఫర్ బెస్ట్ ఫీడింగ్ యాక్షన్(వాబా) అనే సంస్థ పర్యవేక్షణలో డబ్ల్యూహెచ్‌వో, యునిసెఫ్ వంటి అంతర్జాతీయ, బీపీఎన్‌ఐ వంటి జాతీయ సంస్థల అనుబంధంగా ప్రపంచవ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలను ఏటా ఆగస్టు ఒకటి నుంచి ఏడవ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. బిడ్డపుట్టిన గంటలోపే ముర్రుపాలను ఎందుకు పట్టించాలనే అంశంపై ఏటా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖలు సంయుక్తంగా తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పిస్తున్నాయి.

స్తన్యమిచ్చే తల్లి పాటించాల్సిన ఆహార నియమాలు

తల్లులు శిశువుకు స్తన్యమిచ్చే సమయంలో కెఫిన్ పుష్కలంగా ఉండే కాఫీలు, కూల్‌డ్రింక్స్ తీసుకోవడం మంచిదికాదు. మసాలాలు చాలా తక్కువగా తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలు తీసుకోవాలి. ద్రవాహారాన్ని పుష్కలంగా తీసుకోవాలి. పాలిచ్చే తల్లి దాహం తీర్చేంతగా నీళ్లు తాగాలి. కానీ చాలామంది పెద్దలు తల్లిని ఎక్కువగా నీళ్లు తాగనివ్వరు. తల్లి నీళ్లు ఎక్కువగా తాగితే బిడ్డకు జలుబు చేస్తుందంటూ తక్కువ నీళ్లు తాగేలా ఆంక్షలు పెడుతుంటారు. తల్లి ఎక్కువ నీళ్లు తాగితే బిడ్డకు జలుబు చేస్తుందనడం అపోహ మాత్రమే. బీన్స్, వేరుశనగ, అలసందలు, తృణధాన్యాలు, డ్రై ఫ్రూట్స్ ఎక్కువగా తీసుకోవాలి. ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని విటమిన్–సితో ఇచ్చే పండ్లతో కలిపి తీసుకోవడం మంచిది. గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు, బఠానీలు, నట్స్ వంటివి తీసుకోవాలి.

ఏటా అవగాహన కల్పిస్తున్నాం

తల్లిపాల విశిష్టతను తెలియజేసేందుకే తల్లులకు ఏటా అవగాహన కల్పిస్తున్నాం. తల్లిపాల వారోత్సవాల్లోనే కాకుండా సాధారణ రోజుల్లో కూడా తల్లిపాల విశిష్టతను గర్భవతులుగా ఉన్నప్పుడే వివరిస్తున్నాం. తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆదేశాలు ఇచ్చాం. ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న బాలింతలు, గర్భిణులకు తల్లిపాల విశిష్టతను తెలియజేసే ప్రయత్నం చేస్తున్నాం.

– అధికారి గజలక్ష్మి, ప్రాజెక్టు అధికారిణి, ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్టు

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో..

తల్లిపాల వారోత్సవాలను జిల్లా అంతటా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సంయుక్తంగా ప్రజల్లో చైతన్యం కల్పించనున్నాం. బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. తల్లిపాలు రోగాలను ఎదుర్కొనే సహజ సిద్ధమైన శక్తిని ఇస్తుంది. తొందరగా జీర్ణం అయ్యే గుణం తల్లిపాలలోనే ఉంటుంది. ఇటీవల కాలంలో తల్లుల్లో అవగాహన పెరుగుతోంది.

– డాక్టర్ బీవీవీ సత్యనారాయణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, అమలాపురం

ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పున జరిమానా

కపిలేశ్వరపురం: నర్సు విధులను ఆటంక పర్చి దుర్భాషలాడిన కేసులో ఇద్దరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ రామచంద్రపురం కోర్టు జడ్జి గురువారం తీర్పు చెప్పారు. అంగర ఎస్సై అందె పరదేశి తెలిపిన వివరాల ప్రకారం 2018 జూలై 31న అంగర పీహెచ్‌సీలో విధుల్లో ఉన్న నర్సు పాలంగి విజయలక్ష్మిని ఆసుపత్రి వాచ్‌మన్ గొడ్డు వెంకన్న, ఆమె భార్య గొడ్డు కామేశ్వరి దుర్భాషలాడారు. దానిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రాజేష్‌కుమార్ కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి కె.వెంకటేశ్వర రావు నిందితులు ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. బాధితుల తరఫున పీపీ ఎం.సూర్యప్రకాష్ వాదించినట్టు ఎస్సై పరదేశి తెలిపారు.

టోల్ దోపిడీకి ప్రణాళిక

- ద్విచక్ర వాహనాలు, ఆటోలను వదలని మాయదారి కూటమి సర్కారు
- ప్రైవేటు పబ్లిక్ భాగస్వామ్యంతో రూ.కోట్లు దండుకునేందుకు కుట్ర
- సామాన్య ప్రజానీకానికి భారం కానున్న ప్రభుత్వ నిర్ణయం
- మాజీ ఎంపీ చింతా అనురాధ


మాజీ ఎంపీ అనురాధ

అల్లవరం: రాష్ట్ర, జిల్లా, గ్రామీణ రహదారులను అభివృద్ధి చేసి ప్రయాణికులకు సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయవలసిన కూటమి ప్రభుత్వం, ప్రజలను ఎలా దోచుకోవాలి, వారి నుంచి ఆదాయం ఎలా రాబట్టాలనే ఉద్దేశంతో ఉందని మాజీ ఎంపీ చింతా అనురాధ అన్నారు. అల్లవరం మండలం మొగళ్ళమూరులోని ఆమె నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు, పబ్లిక్ భాగస్వామ్యం పేరుతో రాష్ట్ర, జిల్లా రహదార్లపై టోల్ దోపిడీకి తెర తీసి కాంట్రాక్టర్లకు రూ.కోట్లు కుమ్మరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దుర్మార్గమైన ప్రణాళిక చేపట్టారని అనురాధ విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,778 కిలోమీటర్ల పొడవునా 27 కొత్త రోడ్ల నిర్మాణమంటూనే సాధారణ ప్రజల నుంచి టోల్ వసూళ్లకు అనుమతి ఇవ్వడాన్ని అనురాధ తీవ్రంగా ఖండించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సొంతంగా నిధులు సమకూర్చుకుని రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు వేస్తూ, మరమ్మతులు నిర్వహిస్తూ ప్రయాణికులకు అండగా నిలిచామన్నారు. జాతీయ రహదారులపై ఉన్న వాహనాల రద్దీ రాష్ట్ర రహదారులపై ఉండదని, రాష్ట్ర రహదారులపై నిత్యం సామాన్య ప్రజలే రాకపోకలు సాగిస్తారని, వారి నుంచి టోల్ వసూలు చేయడం దుర్మార్గమైన చర్యని అన్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోల నుంచి సైతం టోల్ వసూళ్లకు అనుమతి ఇవ్వడం దారుణమన్నారు. అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రతిపాదించిన అమలాపురం–బొబ్బర్లంక రోడ్డు నిర్మాణానికి సంబంధించి గతంలో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డితో కలసి అప్పటి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. నిధులు మంజూరు సమయంలో టోల్ వసూళ్లకు ఎలాంటి ప్రతిపాదన లేదని అనురాధ తెలిపారు. రాజోలు, పి.గన్నవరం మండలాలను కలుపుతూ రాజవరం–పొదలాడ రోడ్డును వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ రోడ్డుపై టోల్ వసూలు చేయడానికి కూటమి ప్రభుత్వం ఎలా నిర్ణయం తీసుకుందన్నారు. సామాన్య ప్రజలకు భారంగా మారే టోల్ దోపిడీ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని మాజీ ఎంపీ అనురాధ డిమాండ్ చేశారు.

ఆవుసోపాలు


డ్రెయిన్‌లో పడిన ఆవు

అమలాపురం టౌన్: స్థానిక సూర్యనగర్‌లోని ఓ లోతైన మున్సిపల్ డ్రైనేజీలో ఆవు గురువారం ప్రమాదవశాత్తు పడి చాలాసేపు అవస్థలు పడింది. డ్రైనేజీలో పడడంతో పాటు అందులో ఇరుక్కుపోయి బయటకు వచ్చేందుకు వీలు లేక ఇబ్బంది పడింది. స్థానిక వీఆర్వో కొప్పిశెట్టి వెంకట గణేష్ చొరవతో ఆవును డ్రైనేజీ నుంచి బయటకు తీసి రక్షించారు. ఆవును డ్రెయిన్ నుంచి వెలికి తీసేందుకు స్థానికులు కూడా శ్రమించారు.

పారదర్శకంగా మద్యం విక్రయాలు


మద్యం నిల్వలను తనిఖీ చేస్తున్న ముఖేష్‌కుమార్ మీనా. చిత్రంలో కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్: మద్యం విక్రయాలు పారదర్శకంగా ఉండాలని ఏపీ స్టేట్ బేవరీస్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రత్యేక కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. అమలాపురంలోని ఏపీ బేవరీస్‌కు చెందిన లిక్కర్ గొడౌన్‌లో గురువారం ఆయన మద్యం నిల్వలను తనిఖీ చేశారు. గొడౌన్ నుంచి ఏఏ మద్యం బ్రాండ్‌లు సరఫరా అవుతున్నదీ ఆరా తీశారు. గొడౌన్‌లో ఉన్న స్టాక్ రికార్డులను పరిశీలించి వాటి ఆధారంగా మద్యం నిల్వలను తనిఖీ చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మూడు లిక్కర్ గొడౌన్ల నుంచి సరఫరా అవుతున్న మద్యం, దుకాణాల్లో వాటి అమ్మకాలపై ఎక్సైజ్ అధికారులను ప్రశ్నించారు. ఈ తనిఖీల్లో జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్, ఆర్డీవో జి.కేశవవర్ధనరెడ్డి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి అజయ్‌కుమార్ సింగ్, లిక్కర్ గొడౌన్ మేనేజర్ దశమంతరావు పాల్గొన్నారు.

మరుగుదొడ్లకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్


టాయిలెట్ల వద్ద టైల్స్ వేసేందుకు కొలతలు తీస్తున్న సిబ్బంది

అన్నవరం: రత్నగిరిపై పశ్చిమ రాజగోపురం వద్ద షాపింగ్ కాంప్లెక్స్ దిగువన గల మరుగుదొడ్లకు గురువారం మరమ్మతులు ప్రారంభించారు. భక్తులు ఇబ్బంది పడుతున్న వైనంపై గురువారం 'సాక్షి' దినపత్రికలో 'కనుమరుగు' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ స్పందించి వీటికి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఈఈ నర్సింహరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వర రావు, ఎలక్ట్రికల్ డీఈ వి.సత్యనారాయణ ఈ టాయిలెట్స్‌ను పరిశీలించారు. వెస్టన్ కమోడ్స్‌కు ఉండే వాటర్ బాక్స్‌లు కొంతమంది పీకి పారేశారు. కొత్తవి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మహిళల టాయిలెట్స్‌కు వెళ్లే మార్గం నాచుపట్టి ఉంది. మహిళలు ఏమాత్రం ఆదమరిచి ఉన్నా పడిపోయే ప్రమాదం ఉంది. దాంతో ఆ మార్గంలో ఫ్లోరింగ్ చేసి దానిపై టైల్స్ అంటించేందుకు నిర్ణయించారు. ఈ పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని నిర్ణయించారు.

మద్యం తాగి బైక్ నడిపిన 11మందికి జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసులో 11 మందికి రెండురోజుల జైలు శిక్ష, 24 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1,2, కాకినాడ త్రీ టౌన్, టూటౌన్, సర్పవరం, సామర్లకోట,కరప పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం సేవించి బైక్‌పై వెళుతున్నవారిపై కేసులు నమోదు చేశారు. గురువారం కోర్టులో హాజరుపర్చగా 11 మందికి ఒక్కొక్కరికి రెండు రోజులు జైలు శిక్ష, 24 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

జరిమానా విధింపు

మద్యం తాగి బైక్ నడిపిన కేసులో ఎనిమిది మందికి జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.వీరభద్రుడు తీర్పు చెప్పారు. కాకినాడ వన్‌టౌన్, కోరంగి పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం సేవించి బైక్‌పై వెళుతున్నవారిపై కేసులు నమోదు చేశారు. గురువారం కోర్టులో హాజరుపర్చగా 8 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

దాడి చేసిన ఇద్దరిపై కేసు

అమలాపురం రూరల్: పెట్రోల్ లేదన్నందుకు పాన్‌షాప్ యజమానిపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు తాలూకా ఎస్సై శేఖర్‌బాబు గురువారం తెలిపారు. అమలాపురం కార్మికనగర్‌కు చెందిన షేక్ ఖాసిమ్, గరగ పండు మోటార్ సైకిల్ పై పెట్రోల్ కోసం నడిపూడి లాకుల వద్దనున్న పాన్‌షాప్ వద్దకు వచ్చారు. అడిగినంత పెట్రోల్ లేదని యజమాని విత్తనాల రామకృష్ణ చెప్పాడు. దాంతో షాప్ యజమానితో వాగ్వివాదానికి దిగారు. వారి మధ్య మాటా మాటా పెరగడంతో వెంట తెచ్చుకున్న బాటిల్స్‌తో రామకృష్ణపై దాడి చేశారు. గాయపడ్డ అతనిని అమలాపురం ఒక ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

గంజాయి మాత్రలు... ద్రవాలు


- విక్రయాల్లో కొత్త పుంతలు
- రిమాండ్‌కు ముగ్గురు నిందితులు


పట్టుబడ్డ గంజాయి, గంజాయి మాత్రలు, ద్రవాలను మీడియాకు చూపుతున్న డీఎస్పీ హనుమంతరావు. చిత్రంలో సీఐ సురేష్‌బాబు, ఎస్‌ఐ షరీఫ్

కాకినాడ క్రైం: గంజాయి మాత్రలు, గంజాయి ద్రవాలు... ఇలా గంజాయి విక్రయ స్వరూపాన్నే మార్చేశారు కేటుగాళ్లు. అమ్మకాల్లో ఈ టెక్నాలజీ ఏంటా అని ఆరా తీసిన పోలీసులు నిందితుల సమాధానం విని కంగుతిన్నారు. కాకినాడలో బుధవారం పట్టుబడ్డ గంజాయి బ్యాచ్‌ను పోలీసులు విచారించారు. నిందితులను రిమాండ్‌కు పంపారు. మరింత లోతైన అధ్యయనం కోసం విచారణను వేగవంతం చేశారు. సంబంధిత వివరాలను కాకినాడ డీఎస్పీ హనుమంతరావు గురువారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. కాకినాడ జగన్నాథపురం మామిడిపల్లి వారి వీధికి చెందిన 23 ఏళ్ల షేక్ ఇస్మాయిల్, 50 ఏళ్ల షేక్ మౌలాలి, అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం గొప్పులపాలెం గ్రామానికి చెందిన 34 ఏళ్ల జగ్గందొర కొండబాబు.. కొద్ది నెలలుగా బిహార్‌కు చెందిన వ్యక్తి నుంచి గంజాయి మాత్రలు... ద్రవాలు కొని కాకినాడలో విక్రయిస్తున్నారు. వీరిలో ఇస్మాయిల్, మౌలాలీలు మేనమామ అల్లుళ్లు. అనుమానితులైన వీరి ముగ్గురుపై నిఘా కొనసాగుతుండగా కాకినాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కమర్షియల్ రోడ్డులో ఉన్న బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఈ ముఠా విక్రయానికి సిద్ధమైనట్లు పోలీసులకు తెలిసింది. దీంతో మఫ్టీలో వెళ్లి దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడ్డ నిందితుల నుంచి ఆరున్నర కేజీల గంజాయి, 48 గంజాయి ద్రవాల సీసాలు, 150 స్ట్రిప్‌లతో కూడిన 4,500 గంజాయి మాత్రలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న వన్ టౌన్ సీఐ సురేష్‌బాబు, ఎస్‌ఐ షరీఫ్ ఆధ్వర్యంలోని పోలీస్ బృందాన్ని ఎస్పీ విక్రాంత్ పాటిల్, అదనపు ఎస్పీ భాస్కరరావు, డీఎస్పీ హనుమంతరావు ఈ సందర్భంగా అభినందించారు.

అపురూప పత్రం!




రాయుడు త్రినాథ ప్రసాద్

రామచంద్రపురం రూరల్: భారత జాతీయ పతాకం రూపొందించిన పింగళి వెంకయ్య రూపాన్ని నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథ ప్రసాద్ రావి ఆకుపై లీఫ్ ఆర్ట్ ద్వారా చిత్రించారు. ఆగస్టు 2న పింగళి వెంకయ్య 148వ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ చిత్రాన్ని రూపొందించగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కేకేఎల్ కుమారి అభినందించారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

అమలాపురం టౌన్: పట్టణంలోని మార్కెట్ ప్రాంతానికి చెందిన మానుపాటి నాని బాబు అనే యువకుడిపై దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బుధవారం నమోదు చేసినట్లు పట్టణ సీఐ కె.క్రిష్టోఫర్ తెలిపారు. మానుపాటి నానిబాబు ప్రేమిస్తున్న అమలాపురం మండలం సమనస గ్రామానికి చెందిన యువతి బంధువులు గొల్లకోటి ధర్మారావు, శ్రీరామ్, కేశవలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశామని సీఐ చెప్పారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసులు నమోదు చేశామన్నారు. దాడిలో గాయపడ్డ నాని బాబు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందాడు.